అప్లికేషన్ పెట్టుకున్నారు గనక వీళ్ల నిబంధనలకి ఇతర షరతులకి ఒప్పుకుని తీరాలి. వాళ్లూ వాళ్లూ బాగానే ఉంటారు. మధ్యని హింస అనుభవించేది మనం" అన్నాడు మా రెండో అబ్బాయి.

"మా కేంద్రం నుంచి వార్తలు చదివే వారిలో ఎక్కువ మందికి తెలుగు భాష సమంగా పలకడం రాదని మీరు రాసిందాంట్లో నిజం వుందని మేం ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నాం. కాని, కొందరు మాత్రమే ఈ బలహీనత కలిగి వున్నారని మేం ఇన్నాళ్లూ భావిస్తూ వచ్చాం. వీరైనా; వార్తలు చదవడానికి ముందు బాగా గంటల తరబడి రిహార్సల్సు వేసుకుని మరీ కెమేరా ముందుకి వస్తారు తప్ప ప్రిపరేషన్ లేకుండా రారు" అని టీవీ ఆయన వివరించారు.

"అయ్య బాబోయి. తప్పుల తడక భాషా, నత్తీ, మింగుడూ, ఇవన్నీ గంటల తరబడి రిహార్సల్సు అయ్యేకనే ఇలా వస్తే ఇహ ఆ వార్తలు రాసినవి రాసినట్టు చదివితే ఇంకెంతటి సౌరభాలు చిమ్ముతాయో కదా!" అని కుర్చీలో వెనక్కి చారబడిపోయాడు మా పెద్దబ్బాయి.

"ఈ ప్రకటన చూడు" అని జేబులోంచి ఒక కాగితం తీసేడు పరమేశ్వర్రావు. "టి.వి.లో అనౌన్సర్లుగా వార్తలు చదివేవారుగా పనిచేయుటకు యువతీ యువకులు కావలెను. తెలుగు తెలిసివుంటే అదనపు అర్హతగా పరిగణించబడును" అని ఉంది, ఆ ప్రకటనలో. "అయ్యో, అయ్యో!" అని నోరు నొక్కుకుంది మా ఆవిడ.

"ఇది కూడా కార్టూనే లెండి, భైపడకండి" అన్నాడు పరమేశ్వర్రావు నవ్వుతూ.

"మీరందరు ఇంకా ఎన్నో విషయాలమీద మా కార్యక్రమాలు చాలా బావున్నాయంటూ ఉత్తరాలు రాసేరు. అవన్నీ చదవాలనే ఉంది. కాని టైమైపోయింది. ఇంక సెలవిప్పిస్తారుగా. మళ్లా పదిహేను రోజుల్లో మీ ముందుకి వస్తాం."అని టీవీ ఆయన చెప్పడం; టీవీ తెర నల్లగా అయిపోవడం జరిగింది.

"బతికించావు, నీ పుణ్యమాని" అంది మా ఆవిడ నవ్వుతూ.

"చూసేరా! మీలో ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమం చూసి ఎంతో వినోదం పొందేరు. నేనే గెల్చాను!" అని స్నానానికి లేచాడు పరమేశ్వర్రావు. ★

# 21. చిదంబర రహస్యం

చిదంబర రావూ నేనూ అప్పుడెప్పుడో టవును హాల్లో పేకాట ఆడుతూ ఉండినప్పుడు పరిచయస్తులం అయ్యాం. ఇప్పుడు అతనూ ఆడడం మానేశాడు. నేనూ మానేశాను. అయినా మాకిద్దరికీ అప్పుడున్న పరిచయం అలా మెత్తగా సాగుతూనే ఉంది. సినిమాలు పత్రికలు మొదలైన విషయాల్లో అతనికీ నాకూ సామాన్య అభిరుచులు ఉండడం వల్ల మేం ఇద్దరం ఎప్పుడేనా ఎక్కడేనా కలుసుకుంటే చెప్పుకునే కబుర్లు మాకిద్దరికీ ఉన్న పరిచయాన్ని పెంపుచేసేయి తప్ప పాడు చేయలేదు. మొన్నీ మధ్య ఒక పాత సినిమాకి అతనూ నేను శ్రీమతులతో సహా వెళ్లగా మా ఆవిడా, వాళ్లావిడా ఒకే అగ్రహారపు ఆడపడుచులని తెలిసిపోయింది. వాళ్లిద్దరూ ఒసే భ్రమరాంబా అంటే ఒసే సత్తమ్మా అని పిల్చుకుంటూ మమ్మల్నిద్దరినీ మరచిపోయి

నోస్టాల్జియాలోకి వెళ్లిపోతే నేనూ చిదంబరరావూ మాట్లాడుకోడం మరచిపోయాం.

కొన్నాళ్ల కిందట ఈ ఊరికి ముప్ఫయి కిలోమీటర్ల దూరంలో ఒక పల్లెటూరు భూములన్నీ ఈ వూరి నగర అభివృద్ధి సంస్థ వాళ్లు కొనేసి అక్కడ ప్లాట్లు వేసి ఇళ్లస్థలాల కింద అమ్మినప్పుడు అక్కడ ప్లాట్లు సంపాదిద్దామని పాట్లుపడ్డ వాళ్లలో నేనూ, చిదంబరరావు ఉండడం మరో విశేషం. "లాటరీ తీస్తాం, ఆ లాటరీలో గెలిస్తే మీకు ప్లాటు ఎలాట్ చేయబడును" అన్నారు నగర అభివృద్ధి సంస్థ వారు.

చిత్రం ఏమిటంటే ఆ లాటరీలో నాకూ చిదంబరరావుకీ విజయం కలగడం, అందులోనూ పక్కపక్క ప్లాట్లు రావడం! "సైట్లు" స్వాధీనం చేసుకోడానికి, మాకిద్దరికీ ఒకే రోజు, ఒకే టయిము ఫిక్స్ చేస్తే అప్పుడు తెలిసింది ఈ మాట. (లేకపోతే ఈ నగర సంస్కృతిలో మీ పక్క ఇంటివాడి పేరేమిటో మీకు తెలిసి చావదు కదా!)

ఆ రోజు చిదంబరరావు నాకొక జోక్ చెప్పేడు. అదేదో పాశ్చాత్య దేశంలోనట, ఒకాయన చాలా కష్టపడి తను ఉంటున్న మహానగరంలో ఒక ఎడ్రస్‌కి వెళ్లి తలుపు కొట్టి, అందులోంచి తల ఇవతల పెట్టిన పెద్దమనిషితో - "ఎక్స్‌క్యూజ్‌మి. నా పేరు వుడ్ యార్డ్ రట్ లాండ్. మీపేరు తామస్ జెంకిన్స్ కదా! మనం ఇద్దరం ఇప్పుడు ఒకరికొకరు సమీపంలో లేకపోయినా, మరణించిన తరువాత శాశ్వతంగా మనం ఇరుగు పొరుగుగా ఉండబోతున్నాం. ఎందుకంటే సెయింట్ లూక్ శ్మశాన వాటికలో మీరు రిజర్వేషన్ చేయించుకున్న పక్క స్థలమే నేను రిజర్వ్ చేయించుకున్నాను-" అన్నాడట.

"అంటే మనం ఇప్పుడప్పుడే ఇరుగు పొరుగుగా ఉండటం జరగదంటారా?" అన్నాను.

"అనే, అనుకుంటాను. ఎందుకంటే, మన విశాఖపట్నం ఈ ముప్ఫయి కిలోమీటర్ల దూరం వరకూ వాస యోగ్యంగా విస్తరించాలి, అప్పుడు కదా, మనం ఇక్కడ ఇళ్లు కట్టాలి!" అన్నాడు చిదంబరరావు.

"మరి మనం మరింత తరచుగా కలుసుకునే అవకాశమే లేదా?" అన్నాను.

"ఏముంది? మా ఆవిడ ఊరెళ్లినప్పుడు నేను మీ ఇంటికి భోజనానికొస్తాను. అలాగే మీ ఆవిడ ఊళ్లోలేనపుడు మీరు మా ఇంటికి వచ్చేయండి" అని అతను అన్న తరువాత ఒకరింటికి ఒకరు ఎలా వెళ్లాలి అని డైరెక్షన్లు చెప్పుకున్నాం.

చిదంబరరావు వేసిన ఈ స్కీములో మొదటి అవకాశం నాకే వొస్తుందని అదీ ఇంత వేగిరం వచ్చేస్తుందని నేను-అనుకోలేదు. (అతను కూడా అనుకొని ఉండడు. ఎందుకంటే వాళ్లావిడ పుట్టింటికి వెళ్లడమే ఎప్పుడవుతుందో ఎరగని చిదంబరరావు మా ఆవిడ ప్రయాణాన్ని ఎలా వూహిస్తాడు!)

ఆఫీసు పని మీద ఢిల్లీ వెళ్లేను. 17వ తేదీకి చేరాను. పది రోజుల్లో పని పూర్తవుతుందని అంచనా. అందుకని 29కి తిరుగు ప్రయాణం టిక్కెట్ కొనుక్కున్నాను. అయితే 19నే నన్ను బాగా ఎరిగిన ఒక ఉన్నతోద్యోగి నా కేసు వినడం వల్ల; ఫోన్లు, ఫ్యాక్సులు, ఫ్యాన్లు చకచకా పనిచేసి నా పని 24 కల్లా అయిపోయింది. తీరా 26వ తేదీని ఊరు చేరి ఇంటికి వెళితే గుమ్మానికి 150 రూపాయల గోద్రేజ్ కంపెనీ వాళ్ల తాళం కప్ప! మా పొరుగు ఆవిడ నా అవస్థ చూసి అడక్కుండానే

చెప్పింది. "మీరు 30దాకా రారనుకుని; పిల్లల్ని తీసుకుని వాళ్లమేనత్తగారి వూరు, అదెక్కడమ్మా రాజోలు దగ్గిరుందిట - వెళ్లేరండీ. 29కల్లా వస్తానన్నారు. పోనీ, తాళం మా ఇంట్లో ఇచ్చి వెళ్లకూడదూ? అయినా ఆవిణ్ణి అనడానికి వీల్లేదు లెండి. రోజులల్లా వున్నాయి. ఎవర్నీ ఎవరూ నమ్మడం లేదు!" అని సమాచారం సతాయింపూ కలిపి నైవేద్యం పెట్టింది.

ఆ విధంగా చిదంబరరావు ఇంటికి వెళ్లాను. ఢిల్లీ బండి మధ్యాహ్నం రెండున్నర కొచ్చింది. మా ఇంటికి రాడం ఆ మాటలు వినడం వాళ్లింటికి వెళ్లడం ఇదంతా రెండు గంటలు పట్టింది. నాలుగున్నరకి చిదంబరరావు ఎలాగా వొచ్చేస్తాడు కదా అని వెళ్లానన్నమాట.

"ప్రయాణం చేసొచ్చినట్టున్నారు (మీ మొహమే చెప్తోంది) స్నానం చేసి వరండాలో మంచం మీద రెస్టు తీసుకోండి. ఆయన ఆరు కాకముందే వచ్చేస్తారు" అంది భ్రమరాంబ గారు, స్నానం - రెస్టు మధ్య 'భోజనం' ప్రసక్తి తేకుండా జాగర్తపడుతూ.

★ ★ ★

"ఇంట్లో న్యూస్ పేపరు లేదేమిటి?" అన్నాను.

"ఈ మధ్యనే మానేశాను. న్యూస్ పేపరు విలాస వస్తువు అయిపోయింది. మరేం చెయ్యను? పైగా నా కిష్టమైన ఆ పేపరు మధ్యాహ్నం మూడు దాటాక వస్తుంది. నేనింటికొచ్చేసరికి సాయంకాలం ఆరు దాటుతుంది. అంటే లైటేసుకుని చదువుకోవాలన్న మాట. మరి ఈ ఇంట్లో గాలి ఆడదు కదా. అంచేత ఫ్యాన్ కూడా వేసుకోవాలి. ఈ మధ్య కరెంటు ఛార్జీలు పెంచేరు మీకు తెలుసు కదా! అంటే ఏమైంది? లగ్జరీ మీద లగ్జరీ అయిపోయింది పేపరు మేంటేన్ చెయ్యడం! మా ఆఫీసులో ఒకాయన ఈ ప్రక్రియని గురించి ఏమన్నాడో వింటారా? అతనికి విస్కీ అలవాటుంది. సిగరెట్టు అలవాటు కూడా ఉంది. లైటూ ఫ్యాను వేసుకుని న్యూస్ పేపరు చదువుకోవడం అంటే విస్కీ తాగుతూ సిగరెట్టు కాల్చినంత లగ్జరీ అయిపోయిందన్నాడు. బైదిబై, మీకు -" అన్నాడు.

"అబ్బే, అదేం లేదు" అన్నాను మొహమాటపడుతూ.

మేం ఇలా మాట్లాడుకుంటూ వుంటే ఓ కుర్రాడు వచ్చి "సార్, పాత పేపర్లు అమ్మేస్తారా?" అన్నాడు.

"చెప్పేను కదుటయ్యా? నువ్వు పాత పేపర్లు పాత రేటు మీద కొంటే ఇవ్వను. డెయిలీ పేపరు రోజుకి రూపాయి డెబ్బయి పైసలు పోసి కొంటున్నాం. నువ్వేమో కేజీ రెండున్నరకి పట్టుకుపోతానంటావు. కేజీ నాలుగున్నర చేసి తీసుకుంటే తప్పా ఇవ్వను" అన్నాడు చిదంబరరావు.

ఆ అబ్బాయి వెళ్లిపోయాడు.

"టీవీ, రేడియో కొనుక్కున్నాం కనుక, అవెక్కడా పారెయ్యలేం. వాట్లో వొచ్చే వార్తల్నే విని ఈ శేష జీవితం గడిపెయ్యాలి. ఇంచక్కా సాధికారికంగా వొచ్చే న్యూసులు మాత్రం వినొచ్చు. అనవసరంగా మైండు పాడుచేసుకోనక్కర్లేదు. ఏమంటారు?" అన్నాడు చిదంబరరావు.

"మీరు ఇలా అన్నిటికీ ధరలు కడుతూ కూచుంటే ఆయన బైటికెళ్లి భోజనం చేసేసి పడుకోవడానికి మాత్రం మనింటికి వస్తానంటారు" అంది భ్రమరాంబ; దూరం నుంచైనా; స్పష్టంగా సూచన అందిస్తూ. ★